# పాతివ్రత్యం

## పవని నిర్మల ప్రభావతి

పక్కింటి వాళ్ళమ్మాయి గిరిజ వచ్చి చెప్పింది "మేడమ్! మీకు ఫోన్ వచ్చింది!" మాకు ఫోన్ లేదు. ఎవరేనా ఫోన్ చేయాలంటే, మా పక్కింటివాళ్ళ ఫోన్ నెంబరిచ్చాను. పక్కింటికి వెళ్ళి ఫోన్ రిసీవ్ చేసుకున్నాను. "హలో!"

"లలితమ్మ మేడమ్‌గారూ! నేనండీ రంగనాయకిని. మా అమ్మగారు శారదమ్మగారు పలకటంలేదండీ. ఫామిలీ డాక్టరుగారొచ్చి ఇంజక్షన్లు అవీ ఇస్తున్నారండీ. మీరు వెంటనే రావాలి. నాకిక్కడ చాలా భయంగా వుందండీ. ఎవరెవరో వస్తున్నారు, వెళ్తున్నారు. చాలా కంగారుగా వుందండీ" అంది అవతలనుంచి రంగనాయకి. ఆమె గొంతులోని వణుకు స్పష్టంగా తెలుస్తోంది.

"శారదకేమైంది?" గాభరాగా అడిగాను

"బాబుగారు..., అదేనండి శ్రీహరిరావు బాబుగారు మా యజమానిగారు ...వారు లండన్ కెళ్లారు కదండీ బిజినెస్ పనిమీద? వారీరోజు బొంబాయికి వచ్చి, రాత్రికి ఇక్కడికి రావల్సి వుందండీ... హైజాకింగ్... ఆ కబురు తెలియగానే శారదమ్మగారు పెద్దపెట్టున ఏడ్చి సొమ్మసిల్లిపోయారండీ ... పెద్దబాబు రవిచంద్ర కూడా ఈరోజు ఉదయమే ఏదో పనిమీద ఢిల్లీ వెళ్లారండీ" అంది రంగనాయకి. వెంటనే "మీరు త్వరగా రాండి మేడమ్‌గారూ! నాకు చచ్చే భయంగా వుంది. ఈ బంగళా అంతా నేనొక్కర్తెనే చూచుకోవాలంటే" అంది మరింత కంగారు ధ్వనిస్తోందామెకంఠస్వరంలో "వస్తున్నా!" అంటూ ఫోన్ పెట్టేసి, ఇంటికి వచ్చాను. శ్రీవారు, పిల్లలు కాలేజికి వెళ్ళటానికి రెడీగా వున్నారు. సంగతి చెప్పాను.

"అరె! అలాగా! నువ్వెళ్ళు, మా కాలేజి ప్రిన్స్‌పాల్‌గారితో నేనీ విషయం చెప్పి, నీకీరోజు శలవు రాసేట్లుగా చూస్తాను. మధ్యాహ్నం వరకూ నేనూ కాలేజిలో వుండి, నేరుగా శ్రీహరిరావుగారింటికే వస్తాను" అన్నారు. రఘు, రాధ స్కూటర్ మీద వెళ్ళిపోయారు కాలేజికి. శ్రీవారు, నేను వెళ్ళే స్కూటర్ మీద శ్రీవారెళ్ళిపోయారు కాలేజికి. రోజూ అయితే నన్ను, నా కాలేజి దగ్గర దింపి, తను వెళ్ళేవారు. ఈరోజు మా త్రోవలువేరు. ఆటోలో కూర్చొని, శ్రీహరిరావుగారి బంగళా అడ్రస్ చెప్పి, పోనిమ్మన్నాను. ఆటోముందుకీ, నా ఆలోచనలు గతంలోకీ బయల్దేరాయి.



నేను, శారద కాలేజి చదువులలో స్నేహితురాళ్ళమయ్యాం. ప్రకాశంజిల్లా ఓ చిన్న టౌన్‌లో ఇంటర్‌మీడియెట్ పాసైన

నేను, డిగ్రీ చదువుకోసం హైద్రాబాదు వచ్చాను మా మేనమామ గారింటికి. శారద అక్కడే పుట్టిపెరిగిన కలిగినింటి అమ్మాయి. పల్లెప్రాంతం నుంచి వచ్చిన నాకు సిటీలైఫ్ చాలా కొత్త. సిటీ కాలేజిలైఫ్ మరీ కొత్త. శారద నాతో చాలా స్నేహంగా వుండి, తెలియని చాలా విషయాలు తెలియజెప్పటమేగాక, సిటీలో కాలేజి కుర్రాళ్ళ ప్రవర్తనలు, ప్రేమలేఖలు, అవి ఎలా ఎదుర్కొవలసిందీ ఎంతో ఆత్మీయంగా బోధించేది. మామధ్య స్నేహం, చాలా గాఢమైపోయింది. ఎం.ఏ పూర్తిచేశామ్. శారదకు వాళ్ళ దూరపు బంధువైన శ్రీహరి రావుతో వివాహమైంది. శ్రీహరిరావు ఎం.కాం. పాసై, అమెరికాలో ఎం.బి.ఏ చేసి వచ్చాడు. హైద్రాబాదులోనే పెద్దబంగళా, కారు, బిజినెస్ అన్నిహంగులతో, రంగుహరివిల్లులాటి జీవితం వారిద్దరిదీ. వాళ్ళకి రవిచంద్ర, ఉదయభాను ఇద్దరూ కొడుకులు. వాళ్లూ కాలేజి చదువులలో కొచ్చారు. తీరిక టైంలో తండ్రి బిజినెస్ పనులు చూస్తుంటారు. అలా బిజినెస్‌లో మెలకువలు తెసుసుకొనే అవకాశం ఇస్తారు శారద, శ్రీహరిరావులు పిల్లలిద్దరికీ.

చదువు పూర్తిచేసి, అక్కడే వర్కింగ్ వుమెన్స్ హాస్టల్‌లో వుంటూ, ఓ ప్రైవేటు కాలేజిలో లెక్చరరుగా చేరిన నేను, నాలాటి మధ్యతరగతి యువకుడు, ఆ కాలేజిలోనే లెక్చరరుగా వున్న శేఖర్, ఒకరొన్నొకరు ఇష్టపడి వివాహం చేసుకున్నాం. శాఖా బేధాల పట్టింపులు కూడా చాలా ఎక్కువగా వుండిన మా ఇరువురి కుటుంబసభ్యులు, మొదట మా పెళ్ళికి తీవ్ర అభ్యంతరం తెలిపారు కానీ, మా పట్టుదల తెలుసుకుని, మా వివాహం వాళ్ళే జరిపించి తమ పెద్దరికం కాపాడుకున్నారు తర్వాత.

మాకు రఘు, రాధ ఇద్దరు పిల్లలు. రఘు బి.కాం లోకి వచ్చాడు. రాధ ఇంటర్‌లోకి వచ్చింది. మధ్య తరగతి కుటుంబం ఈనాడు ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ, వత్తిడులన్నిటినీ మేం అనుభవిస్తూనే వున్నాం. మేమిద్దరం సంపాదిస్తున్నా, ఆర్థిక పరిస్థితి కటకటగానే వుంటోంది. నెలకు ఎనిమిదివందల రూపాయల అద్దెఇంట్లో ఇద్దరు కాలేజిలో చదివే పిల్లలతో, మా ఇద్దరికీ, ఎంత "బడ్జెట్ పండితులమైనా" ప్రతినెలా లోటుబడ్జెట్‌తోనే సాగుతోంది సంసారం. ఒక్కోసారి బంధువుల, స్నేహితుల తాలూకు పెళ్ళిళ్లు, బహుమతులు, ప్రయాణాలు రావటంతో ఆ నెల బడ్జెట్ మరింత తలక్రిందులై పోతుంది. అలాటి సమయాలలో శారద నా ఆప్తమిత్రురాలిగా అడగ్గానే వెయ్యి, రెండువేల వరకూ వడ్డీ లేని అప్పు నే కోరినంత ఇస్తుంది. అది ఓ రెండు మూడు నెలల్లో లెక్కప్రకారం ఇచ్చేస్తుంటాను నయాపైసలతో సహా.

శారద కాలేజి స్నేహితురాలిగా అమె పిల్లలు చిన్నపిల్లలుగా వున్నపుడు, ఆమె ప్రవర్తన చాలా ఉన్నతంగా వుండేది. డబ్బుకు కతీతంగా వుండేది ఆమె స్నేహం. కాని రానురాను ఆమె పిల్లలు పెరిగాక, డబ్బు, అంతస్తు, హోదా మరింతగా పెరిగాక, శారద సాటిమనుషుల్ని కేవలం డబ్బు కళ్ళతోనే చూస్తున్నట్లు నాకు అనుమానమే గాక, అనుభవం కూడా కావటం మొదలయ్యింది.

"చూడవోవ్ లలితా! ఇంతేనా మీ ఆర్థిక పరిస్థితులు ఎంతకీ? ఇక మార్పే రాదా! అప్పులు తీసుకోవటం, తీర్చటం ఇదేనా జీవితధ్యేయం" అంటుంది నాకు అప్పు ఇస్తూ.

"నీలా కోట్లు డబ్బుంటే - నేను ఈ మాట అనకుండానే ఎందరికో ఆర్థిక



సాయం చేసేదాన్ని... ఆ సంస్కార సంపద నాకుంది. కానీ నాకు దురదృష్టమో అదృష్టమో డబ్బు లేదు." అనే జవాబు చెప్పాలనిపించినా, నా ఆర్థిక అవసరం, బయటెక్కడేనా అప్పు తీసుకుంటే, అసలుకంటే వడ్డీ ఎక్కువ అయ్యే ప్రమాదం, నా మాటల్ని మనసులోనే ఆపేసేవి. చిరునవ్వే సమాధానంగా ఇచ్చేస్తాను. శారదకు మరో 'మేనియా' కూడా ప్రారంభమైంది.

తాను చాలా పతివ్రతనని! తన సాటి పతివ్రతలు ప్రపంచంలోనే లేరనీనూ.

"మా శ్రీవారిని నేను ఒక్క క్షణం వదిలి వుండలేనోయ్! బొంబే వెళ్ళినా, ఢిల్లీ వెళ్ళినా, మరే ఇతర దేశం వెళ్ళినా, నేనూ వెళతాను వెంట. ఇలా భర్తని అనుక్షణం అంటిపెట్టుకుని వుండే స్త్రీలు వుండరని అంటుంటారు మా శ్రీవారు కూడా! అవునా?" అంటుంది.

నాకు నవ్వొస్తుంది. ఈ దేశంలో పతివ్రత కాని స్త్రీ ఎవ్వరు? కానీ వారి వారి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, భర్తలొకచోట, భార్యలొకచోట ఉద్యోగాలు చేసుకోవాలి. మాలా కలిసివున్నా, ఎవరి పనుల మీద వారు పరుగులు తీయాలి. లేకుంటే, పిల్లల భవిష్యత్తు దెబ్బ తింటుంది. ప్రతి వ్యభిచారిణీ పతివ్రతే! ఆమె తాను ప్రేమించినవాణ్ణి గుడ్డిగా నమ్మి వెంటవచ్చి, మోసగించబడుతోంది......

ఈ జవాబు నా దగ్గర సిద్ధంగావున్నా, చెప్పానుగా? నా ఆర్థిక అవసరంగా గొంతు నొక్కివేస్తుంది. తలూపుతాను విధిలేక. ఆర్థిక పరిస్థితి ఒక్కటే ఎంతగా స్వేచ్ఛను అరికడుతోందో అర్థమై గిలగిలలాడి పోతుంటాను అలాటి సందర్భాలలో.

రంగనాయకి మా వూరి మనిషి. చిన్నప్పుడు నాతోబాటు టెన్త్‌క్లాసు వరకూ చదువుకుంది. అప్పుడే వాళ్ళమ్మ చనిపోయింది. వాళ్ళ నాన్న తాగుడికి బానిసైపోయాడు. వాళ్ళ మేనత్త రంగనాయకిని దగ్గరకు తీసి, తన కొడుకు శ్రీనివాసులు కిచ్చి పెళ్ళిచేసింది. శ్రీనివాసులికి చదువూ సంధ్యా లేదు. వడ్రంగం తెలుసు. ఆ వృత్తిమీదే నాలుగు డబ్బులు సంపాదిస్తాడు. పేకాడుతాడు. ఈ మధ్యే తాగుడూ నేర్చుకున్నాడు.

రంగనాయకి తనకా పెళ్ళి వద్దని ఏడ్చి మొత్తుకుంది. కానీ మేనత్త "నీ కెవరు చేస్తారే పెళ్ళి? మీ అమ్మ చచ్చింది. మీ నాయన వున్నా చచ్చిన వాళ్ళలో జమ అయ్యాడు. ఇంకా చదివి నువ్వు సాధించేదేమిటి?" అంటూ రంగనాయకి నోరుమూసి, నలుగురు గుండాల సాయంతో, గుళ్ళో దొంగపెళ్ళి జరిపించింది. రంగనాయకికి ఇద్దరు పిల్లలు. ఆసరికి అత్త చచ్చింది. పిల్లల్నిద్దర్నీ చదివించి, తనలా వారి జీవితం నాశనం కాకుండా మంచిగా మలచాలన్నది ఆమె ధ్యేయం. శ్రీనివాసులుని ఎలాగో ఒప్పించి హైద్రాబాద్‌కు తరలించింది. పెద్దవాణ్ణి హైస్కూల్లో, పిల్లను హైస్కూల్లో చేర్పించింది! శ్రీనివాసులు సంపాదన అతగాడి ఖర్చులకే సరిపోతుంది. నా దగ్గరకు వచ్చింది, ఏదైనా పని చూపించమనీ, గౌరవంగా జీవితం వెళ్ళమారే దారీ, తన పిల్లలను చదివించుకొనే దారీ చూపమని ప్రాధేయపడింది.

సరిగ్గా ఆ టైంలోనే శారదకు వాళ్ళ శ్రీవారితో తరచూ ట్రిప్పులు ప్రారంభమైనాయి. ఇంట్లో నౌకర్లెందరున్నా, పిల్లలకి వేళకు కాఫీ, టిఫిను భోజనం చూస్తూ, అతిథులపన్లు చూస్తూ, ఇల్లంతా నమ్మకంగా చూచుకొనే 'సర్వెంట్ మెయిడ్' కావాలంటూ నాతో చెప్పింది శారద. నాకు రంగనాయకి గుర్తొచ్చింది.

రంగనాయకి కా ఉద్యోగం ఎంతో తృప్తినిచ్చింది. తన భోజనం, బట్టలు గడిచిపోయి, నెలకి ఐదు వందలిస్తుంది శారద. నీడపట్టున పని. ఇంటిపని కావటంవల్ల రంగనాయకి సంతోషంగా ఒప్పుకుంది. శారదకూడా రంగనాయకి చదువూ, సంస్కారం, పనితీరు, చాలా చాలా నచ్చాయి. అంచేత ఇటు శారద, అటు రంగనాయకీ కూడా నాపట్ల మరింత కృతజ్ఞతగా వుంటున్నారు.

వారం క్రితం శ్రీహరిరావు వ్యాపారం పనిమీద లండన్ వెళ్ళాడు. శారద వెళ్ళవలసింది. కానీ, ఆమెకీ మధ్య విమాన ప్రయాణాలు ఎక్కువగా చేస్తే, వాతావరణ మార్పుకి 'ఎలర్జీ' వస్తోంది. విపరీతమైన తుమ్ములు, ఆయాసం, వాంతులు అలా వుంటున్నాయి. అంచేత కొంతకాలం విమాన ప్రయాణాలు తరచూ చెయ్యొద్దని సలహా ఇచ్చారు డాక్టర్లు. అంచేత వెళ్ళలేదు. ఈ రోజు ఈ విమానం హైజాకింగ్ వార్తతో 'షాక్' తిన్నది.


"తమరు దిగండి!" అన్నాడు ఆటో డ్రైవర్ బంగళాముందు ఆటో ఆపుతూ. ఆలోచనలు ఠక్కున ఆగిపోయాయి. గతం మాయమై, వర్తమానం ఎదుట నిలిచింది. అతగాడికి డబ్బులిచ్చి, బంగళాలోకి పరుగులాటి నడకతో వెళ్ళాను. ఆ సరికే ఎన్నో కార్లు, ఆడ మగ మనుషులు వచ్చివున్నారు. శారద ఓ అరగంట క్రితమే స్పృహలోకి వచ్చిందట. శారద పట్టశక్యం కానంత ఉద్రేకంతో ఏడుస్తోంది. తను, తన భర్త గడిపిన జీవితాన్నంతా నెమరు వేస్తోంది మాటలతో. ఇక ఆయన తిరిగి రాకుంటే, తను బ్రతకనని శపథం చేస్తోంది.

అందరూ ఓదారుస్తున్నారు. ఆమెకి ధైర్యం చెబుతున్నారు. మరణంలాటి అఘాయిత్యం వద్దని మందలిస్తున్నారు. ఆమెకి అందుబాటులో స్లీపింగ్ పిల్స్

గానీ, గట్టి తాడు గానీ, కరెంట్ పరికరాలుగానీ, మరే మారణాయుధాలుగానీ అందుబాటులో లేకుండా, ఆమె రూంలో నుంచి బయటకు రాకుండా ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు ఆయాలు, ఆమె సన్నిహిత బంధువులు గట్టి ఏర్పాటుచేశారు.

నన్ను చూడగానే నాఒళ్ళో వాలిపోయి గట్టిగా ఏడ్చింది శారద...నాకూ కన్నీళ్లు కారిపోతున్నాయి... 'నేనేం చేయగలను ఈమెకీ టైంలో సాయం?' మనసు వేదనపడుతోంది. "మీవారొస్తారు. బిడ్డల్ని గుర్తుకు తెచ్చుకో - ఏ అఘాయిత్యం చేయకు. రవి, ఉదయ్ నువ్వు లేకుంటే బ్రతకలేరు. నాకో మాట ఇవ్వు-ఏ పిచ్చిపనీ చేయనని..."అలా ఓదారుస్తున్నాను. "మన ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోందండీ హైజాకర్స్‌తో. వాళ్ళ కోర్కెలు అంగీకరించైనా, మన విమానాన్ని మరలా వెనక్కి తెస్తారు. రెండు వందల యాభై మంది ప్రయాణీకుల ప్రాణాలు హైజాకర్స్‌కి విలువలేనివి కావొచ్చు గానీ, మన ప్రభుత్వానికి ప్రతి ప్రాణమూ విలువైనదే. శ్రీహరిరావుగారికి ఏ ఆపదా రాదు. నా మాట నమ్మండి. కాకపోతే బాడ్ లక్. బాడ్ టైం. మెంటల్ టార్చర్. అంతే!" అన్నాడొక బిజినెస్ మాగ్నెట్ - తనోసారి ఇలాటి హైజాకింగ్‌లో ఎలా చిక్కుకున్నదీ వివరిస్తూ. రంగనాయకి అందరికీ మర్యాదలు చేస్తోంది నిర్వికారంగా. నా హృదయంలో శతకోటి ప్రశ్నలు. శ్రీహరిరావుని హైజాకర్స్ ఏదేనా చేస్తే, శారద నిజంగా చనిపోతుందా? పిల్లల్ని గురించి ఆలోచించదా? ఈ బంగళా, ఈ హోదా, ఈ అంతస్తులను అంత తేలికగా ఆమె మరణంతో త్రోసివేస్తుందా?

ఈ ఎమోషన్ ఎంతవరకూ వుంటుంది? ఇప్పుడిప్పుడే శారద చావాలన్నా ఏ ఆత్మహత్యా ప్రయత్నమూ




ఫలించకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేసేశారంతా...

ఒకటి, రెండు రోజులయ్యాక ఈ ఎమోషన్ ఆమెలో నిలవదేమో!

అవును, అలా చనిపోయేట్లయితే, ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా వున్న విధవలంతా ఎలా బ్రతికివున్నారు? వారందరూ పతివ్రతలు కారా? భర్త చనిపోయే క్షణంవరకూ వారంతా భర్తని ప్రాణాధికంగా ప్రేమించినవారే! ఈ క్షణంలోనూ ఆ కీర్తిశేషుల్ని మానసికంగా తమలో నిలుపుకుని, ప్రేమిస్తున్నవారే....కానీ కానీ భౌతికంగా మరణించి లేకపోయారు. పోతున్నారు. ఎంచేత? పిల్లలమీది మమకారం కావచ్చు-జీవితం పట్ల వదలని మమకారం కావొచ్చు... అవేవీ కాకుంటే ఆ దుఃఖపు ఎమోషన్ కొద్దిగంటల తర్వాత కంట్రోల్ అయి-వివేకాన్ని మేల్కొల్పటం కావొచ్చు.

"లలితగారూ! మీరు త్వరగా రావాలి!" ఎవరో పిలిచారు. రూం బయటకు వచ్చాను. ఎందుకో తెలియదు రంగనాయకి కూడా నా వెంట కారులో కూర్చోబెట్టుక హాస్పిటల్‌కు పిలుచుకు వచ్చారు. త్రోవలో ఏమీ చెప్పలేదు... హాస్పిటల్‌లో 'ఇంటెన్సివ్ కేర్'లో వున్న మా శ్రీవారు... చనిపోయిన శ్రీనివాసులుమీదపడి ఏడుస్తున్న రంగనాయకి! నాబుర్ర గిర్రున తిరిగినట్లైంది. ఏమైందో తెలీదు. నాకు బాగా ఒళ్లు తెలిసేసరికి, రఘు, రాధ నా బెడ్ పక్కనే కన్నీళ్ళతో నిల్చుని వున్నారు. రంగనాయకి కనిపించలేదు. అప్పుడు తెలిసింది.

కాలేజికి వెళ్ళి, నాకోసం శ్రీహరిరావుగారి బంగళాకు వస్తున్న శ్రీవారికి శ్రీనివాసులు కనిపించాడు త్రోవలో. అతగాడికి పేకాట, కొద్దిపాటి తాగుడూ వ్యసనాలున్నా, రంగనాయకిని ఎప్పుడూ పల్లెత్తుమాట అనడు. రంగనాయకి కూడా అతగాణ్ణి ప్రాణాధికంగా ప్రేమిస్తుంది. అతగాడి వ్యసనాలు మానడని తెలిసీ వూరుకుంది...

శ్రీనివాసులు కూడా వస్తానన్నాడు బంగళాకి. ఇద్దరూ స్కూటర్ మీద వస్తుండగా యాక్సిడెంట్ అయ్యింది. శ్రీవారికి తలకు తీవ్రమైన గాయాలు తగిలాయి. బాగా కుట్లు పడ్డాయి. కనీసం మూడు నెలలైనా పట్టవచ్చు కోలుకొనేసరికి. శ్రీనివాసులు అక్కడికక్కడే మరణించాడు...

శారద గుర్తొచ్చింది... ఆమె ఆత్మ

హత్య చేసుకోకుండా ఎందరో కాపలాగా వున్నారు. నాకూ రంగనాయకికీ అలాటి కాపలాలు ఏవీ లేవు. అలా ఆంక్షలు పెట్టేవారూ దగ్గర్లో ఎవరూ లేరు. మరి, నేను రంగనాయకి చనిపోలేదేమిటి! నేను స్పృహతప్పిపోయాక ...కొద్ది గంటలు, 'కోమా'లో వుండేలా 'సెడెటివ్' ఇచ్చారట డాక్టర్లు. రంగనాయకి భర్త శవాన్ని వెంటబెట్టుకవెళ్ళిందట ఇంటికి, దహనసంస్కారాలు చేయించటానికి! మేము నిజంగా శారద లాటి పతివ్రతలం కామా? మాకు మా భర్తలమీద ప్రేమ లేదా?

"అమ్మా!" పిల్లలిద్దరూ ఒకేసారి పిలిచారు కన్నీళ్ళతో.

"మేం బాగా కనిపిస్తున్నామా అమ్మా?" రాధ పెద్దగా ఏడ్చింది...


"నువ్వూ లేకుండా మేం ఎలా బ్రతకాలి? మా భవిష్యత్తు ఏం కావాలి?"

మళ్ళీ ఇద్దరూ ఏడ్చారు నా గుండెల మీద పడి ... వెక్కిళ్ళతో కన్నీళ్ళు వచ్చాయి.

"చదువుకున్నవాళ్ళు మీరంతా! ఇలా అధైర్యపడవచ్చా? నాన్నగారికి ప్రమాదం తప్పింది. ఆయన కోలుకుంటారు... ఓ మూడునెలలు కాస్తంత కష్టం... అంతే!" అంది ఆర్ద్రంగా. ఓ స్త్రీగా ఆమె కళ్ళల్లోనూ తడి కనిపించిందా క్షణంలో!

నేనూ చనిపోయివుంటే ఈ పిల్లల భవిష్యత్తేమిటి? ఆ సాయంత్రమే నన్ను డిశ్చార్జి చేశారు. వారం తర్వాత శ్రీవారిని ఇంటెన్సివ్ కేర్ యూనిట్ నుంచి-మామూలు స్పెషల్ రూంలోకి మార్చారు. కళ్ళెత్తి చూడటం, చిన్నచిన్న మాటలు మాట్లాడటం, కొద్దికొద్దిగా లిక్విడ్. డయట్‌లోకి వచ్చారు.

"మీ శ్రీవారి కింకేం ప్రాణభయం లేదు లలితగారూ!" అంది డాక్టర్ సాఘజంతట్టి ధైర్యంచెబుతూ.




పదిహేనురోజుల తర్వాత కాలేజికి అటెండ్ అయ్యాను. శారద భర్త శ్రీహరిరావు క్షేమంగా ఇల్లుచేరాడట ఆ మూడోరోజు... రంగనాయకి భర్త కర్మక్రతువులు పూర్తిచేయించి శారద 'ఫర్వాలేదు- రావొచ్చు - పనికి ఇబ్బందిగా వుంది' అని కబురంపితే, మళ్ళీ డ్యూటీలో చేరింది. ఇవన్నీ పిల్లలు చెప్పారు. నా ఎదలో ముల్లులాటి బాధ. కనీసం మర్యాదగానైనా, శారద హాస్పిటల్‌కు రాలేదు. మా శ్రీవారిని పలకరించలేదు. నన్ను ఓదార్చలేదు. రంగనాయకికి జరిగిన ఘోరం గురించి అసలు పట్టించుకోలేదు సరికదా, తనకు ఇంటిపనులకు చాలా కష్టంగా వుందనీ, అలక్షమైన పనిమనిషిగా రంగనాయకిని త్వరగా వచ్చి పనిలో చేరమనీ, తమకే సనాతన పట్టింపులూ లేవనీ కబురు మాత్రం పంపి రంగనాయకిని పిలిపించుకుంది! కానైతే, ఈ అవమానాన్ని దిగమింగి నేను డబ్బు అప్పుకోసం, శారద దగ్గరకు వెళ్ళొచ్చాను. రంగనాయకికి సానుభూతి చెప్పాను. రంగనాయకి కూడా నాలానే నిర్లిప్తంగా పన్లు చేసుకొంటోంది, శారద భర్త శ్రీహరిరావుగారు రెండుమాట్లు "మీ శ్రీవారు కోలుకుంటున్నారు కదమ్మా లలితా? మా శారదను మీలాటి ధైర్యం అలవర్చుకోమని చెబుతుంటా నెప్పుడూ! కానీ తను నా మాట వినదే! నాతోనే ప్రపంచం అంటుంది. నే లేకుంటే తాను లేనంటుంది. హైజాకింగ్ సుఖాంతం కాకుంటే, తాను చనిపోయివుండేదాన్నంటుంది. ఏమిటండీ ఈ వెర్రి? మీరు మీ శ్రీవారికి యాక్సిడెంట్ కాగానే మరణించారా? మీ డ్యూటీ మీరు చేసుకోవటంలా? ఇదెక్కడి మనిషండీ బాబూ!" అన్నారు శారదవేపు గర్వంగా తృప్తిగా చూస్తూ. శారద కూడా ఆ టైంలో "ఔను లలితా! మీలాటి ధైర్యం నాకు లేదోయ్! ఆయనలేని నేను లేను!" అంది గర్వంగా. నా వెన్నుమీద వాత వేసినట్లైంది. అక్కడే పని చేసుకుంటున్న రంగనాయకి చూపులు నా చూపులతో కలుసుకున్నాయి. ఆ కళ్ళలో నిప్పులు కురుస్తున్నట్టు, రక్తం చిమ్ముతున్నట్టు ఎర్రని జీరలు కనిపించాయి. శారద అంది "రంగనాయకికి చాలా ధైర్యం లలితా నీకంటే కూడా! శ్రీనివాసులు శవాన్ని స్వయంగా ఇంటికి తీసికెళ్ళిందట. తర్వాత తంతు జరిపించిందట! నేను మా ఇంటిపనికి

రాదేమోనని భయపడ్డాను సుమా! కానీ చెప్పి పంపగానే వచ్చేసింది!"

రంగనాయకి ఇంట్లోకి వెళ్ళిపోయింది ఏదో పనివున్నట్లు. నేను డబ్బు పుచ్చుక వచ్చేశాను నామీద నాకు కలిగిన అసహ్యంతో.

మూడు నెలలు ఎలా గడిచిపోయాయో నాకే తెలియదు. ఇల్లు, పని, పిల్లలు, కాలేజీ, తర్వాత హాస్పిటల్‌కు వెళ్లటం, ఇలా రొటీన్ రోజుకు, "విశ్రాంతి" అనే మాట తెలియనంత బిజీగా మారిపోయింది. అత్యవసరంగా కావలసిన డబ్బు, శారద దగ్గర తప్పనిసరిగా అప్పుగా తీసుకొన్న ప్రతి సందర్భంలోనూ శారద, శ్రీహరిరావులు, పాతివ్రత్యానికిచ్చే వ్యాఖ్యానాలు విచ్చుకత్తుల్లా గుండెల్లో గుచ్చుకుంటున్నా, లెక్కచేయని మానసిక స్థితికి ఎదిగిపోయాను.

స్త్రీలలో ఎక్కువమంది నాలా రంగనాయకిలా రాతిగుండె మనుషులు. భర్తతో చాలా సంవత్సరాలు దాంపత్య జీవితం గడిపి, ఆ వ్యక్తి మరణిస్తే, కాసేపు ఏడ్చి- తర్వాత మామూలుగా బతికేస్తుందా సగటు స్త్రీ?

ఒక రోజంతా ఆత్మహత్య చేసుకుంటానని గోలచేసిన స్త్రీ లెందరో మర్నాటికి ఆ ఎమోషన్‌లో నుంచి బయటపడి- పిల్లలతో వచ్చిన బంధువులతో "ఇంట్లో ఆ గదిలో ఆ వస్తువుంది, ఈ గదిలో ఈ వస్తువుంది. జాగ్రత్త! పనివాళ్లు కొట్టేస్తారేమో...' అని పురమాయించటం, ఓ నెల తిరిగే సరికి, మామూలు పనిలో లీనమై పోవటం, పిల్లల బాధ్యతలు నెరవేర్చవలసి వుంటే నెరవేర్చటం, లేక పిల్లల బాధ్యతలు తీరిపోయినవారైతే- కొడుకుల్నీ, కోడళ్లనీ వేధించటం, సాధించటం తమ కర్తవ్యంగా తలచుకోవటం, ఇదంతా ఏమిటి? ఈ జీవితానికి అర్థం ఏమిటి? రాత్రింబగళ్లు ఎన్నో చిక్కు ప్రశ్నలు, ఇలా నా తల పగిలిపోయేటన్ని ప్రశ్నలు క్షణం క్షణం నన్ను వేధిస్తున్నాయి. మూడు నెలల తర్వాత శ్రీవారు, మామూలు మనిషై ఇంటికి వచ్చారు.

"మీరు అదృష్టవంతులు లలితా! ఆ జరిగిన యాక్సిడెంట్‌లో మీ శ్రీవారి తలకు చాలా దెబ్బలు తగిలాయి. మైండ్ చెడిపోతుందేమోనని భయపడ్డాము. కానీ వారు నార్మల్‌గా కోలుకున్నారు. మీ డ్యూటీ మీరు నిర్వర్తిస్తూ ఆయనగారిని ఎంత సున్నితంగా కాపాడుకున్నారో... మేం నిజంగా మిమ్మల్ని అభినందిస్తున్నాం." అన్నారు డాక్టరు శ్రీవారు డిశ్చార్జి అయి ఇంటికి వచ్చేరోజు నాతో. నవ్వి వూరుకున్నాను గిల్టీగా...

చాలా రోజుల తర్వాత ఇంట్లో వెన్నెల విరిసినట్టు, పిల్లలు, ఆయన, నేను ఒకే టేబిల్ దగ్గర కూర్చొని భోజనాలు చేశాం అలవాటుగా. మేడ మీదికి పిల్లలు వెళ్లిపోయారు. చాలా కాలం తర్వాత విశ్రాంతిగా దొరికిన ఏకాంతం. నన్ను నేను కంట్రోల్ చేసుకోలేనంతగా ఏడ్చేశాను... శారద, శ్రీహరిల వాగ్బాణాలు నా కన్నీళ్ళలో ప్రవహించాయి. నా రాతిగుండె నా శ్రీహరి ముందు పరిచాను-

శ్రీవారు బలహీనంగా నవ్వారు.

"నీది రాతిగుండే? నువ్వు పతివ్రతవు కావా? ఏం మాటలవి లలితా! నాకు స్పృహ తెలిసినప్పటి నుంచీ నాకు ఒకే ఒక భయం! ఏ ఎమోషన్‌లో నువ్వు ఏం చేసుకొంటావోనని!

"శారద శ్రీహరి మాటలు డబ్బు హుజంవి. ఆ పాతివ్రత్యాలు కోట్లు, లక్షల విలువలలో చూడబడే మాటల మూటలవి!...

నీ పరిస్థితిలో వున్న ఏ స్త్రీ అయినా, పాతివ్రత్యం అనే పిచ్చి సెంటిమెంటుతో ఆత్మహత్య చేసుకుంటే, అది ఆమె అజ్ఞానానికి పరాకాష్ఠ లలితా! మన ఇద్దరి ప్రతిబింబాలు- మన ఇద్దరి మంచి చెడు గుణగణాల ప్రతిరూపాలు, మన ఇద్దరి జీవితధ్యేయపు లక్ష్యాలు మన పిల్లలు! వారి భవిష్యత్తు ఏ ఇతరులు చేపట్టరు. చేపట్టినా కానీ శారదలా శ్రీహరిలా మాటల ఈటెలతో వారిలోని కాన్ఫిడెన్స్‌ని సమూలంగా పొడిచి, పొడిచి చంపి, మరీ కాస్తంత చేయూత ఇస్తే ఇస్తారు. లేకుంటే అదీ లేదు. నీ పాతివ్రత్యపు మరణం విలువ- వారి జీవిత నరకసోపానం.

"శారదలాంటి స్త్రీలు ఎప్పుడూ పాతివ్రత్యం అంటూ మరణించరు. వూరికే ఖరీదైన కబుర్లు చెబుతారు. దురదృష్టవశాత్తు ప్రమాదాలు సంభవిస్తే, నీవు వదిలి వెళ్ళిన డ్యూటీ నేను, నేను వదిలి వెళ్ళిన డ్యూటీ నీవు సక్రమంగా పూర్తి చేయటమే పాతివ్రత్యం లలితా!

"రంగనాయకి లాటి ఇల్లాళ్ళు మహా పతివ్రతలు...అయితే వారికి శారద కున్నంత గుర్తింపు, శారద మాటల లాంటి వాక్చాతుర్యం లేవు. ఈ దేశాన్ని ఈ జాతిని, మానవ జీవిత విలువలను, ధ్యేయాలను కాపాడుతున్నది అలాటి గృహిణులే లలితా! నీవు అందులో ఒకర్తెవు...కన్నీళ్లు పెట్టుకోకు...నీ అదృష్టంకొద్దీ నేను బతికి బయటపడ్డాను కదా?"

నేను అవాక్కైపోయాను. నా ప్రశ్నలన్నిటికీ సమాధానం దొరికింది. నా గిల్టీ కాన్షస్ ఒక్కసారిగా గాలికెగిరిపోయింది. ఈసారి శారద ఏమైనా అననీ...జవాబు చెబుతాను...హాయిగా నిద్రపట్టిందా రాత్రి.

ఉదయాన్నే లేచి, నా ఎనిమిదికాసుల బంగారుగొలుసు నాకు తెలిసిన బంగారు

కొట్టులో అమ్మేశాను. న్యాయమైన రేటు వచ్చింది. గొలుసు మా పెళ్లైన కొత్త రోజుల్లో, పైసాపైసా కూడబెట్టి మేమిద్దరం కలిసి అపురూపంగా చేయించుకున్నది. అదే రాధకూ, రఘుకు రాబోయే భార్య (మా కోడలు)కూ చెరిసగంగా ఒక్కోపేట పెళ్ళి సమయంలో మా చిరుకానుకగా ఇద్దామనుకున్నాము. ఎన్ని ఆర్థిక ఇబ్బందులొచ్చినా దాన్ని అమ్మే ప్రయత్నం చేయలేదు. కానీ ఈనాడు ఆ గొలుసు తాలూకు మధురస్మృతులు, సెంటిమెంట్సు- అన్నీ పక్కకునెట్టి అమ్మేశాను. శారద అప్పు తీర్చివేయాలి ముందు. మరెప్పుడూ ఆమె దగ్గరికి అప్పుకు వెళ్ళకూడదు...

డబ్బు చేతబట్టుక శారద ఇంటికి వెళ్ళాను

“మీ శ్రీవారు ఇంటి కొచ్చారట గదా? ఏదీ చూచివద్దామనే అనుకుంటూనే వున్నాను రాలేకుండా వున్నాను లలితా! ఆ హైజాకింగ్ తర్వాత, మా శ్రీవారిని క్షణం వదలి వుండటంలేదంటే నమ్ము! టూర్స్‌కి వెంట వెళ్తున్నాను. ‘ఎలర్జీ’ రానీ- మరేదైనా రానీ! ఏం చెయ్యను నీలా, రంగనాయకిలా ధైర్యం నాకు లేకపోయె!” అంది శారద ఎప్పటిలానే!

నేను జవాబు చెబుదామని నోరు తెరిచేలోగా, రంగనాయకి సుడిగాలిలా దూసుకు వచ్చింది. “తమరిలాటి పతివ్రతల్ని నేనెక్కడా చూళ్ళేదండీ! మాకలాటి పాతివ్రత్య ఎలా కుదురుతోందండి? నా భర్త వ్యసనపరుడు. అయినా నేనాయన్ని వదిలేసి- ఎవరితోనూ వెళ్ళిపోకడలు పోలేదు. ఆయన నాకేం సంపాయించి పెట్టకపోయినా. ఆయనలో కోట్ల డబ్బును గాక, నా భర్త అనే విలువనే చూశాను. ఆయన చనిపోతే, మా బిడ్డల్ని ఈ ప్రపంచంలో మనుషులుగా నిలబెట్టవలసిన బాధ్యత నాదనుకున్నాను. నా భర్తని అనుక్షణం చూసుకుంటున్నాను. లలితమ్మగారూ అంతే!

“కానీ, మీకు డబ్బుంది. మీరు మాలా ఉద్యోగాలో, పనులో చేసుకుంటూ కుటుంబపోషణ భారం వహించవలసిన అవసరం లేదు. మీరు ‘ఆత్మహత్య’ చేసుకుంటాం చేసుకుంటాం అంటారే తప్ప చేసుకోరు ఆ సంగతి తెలిసీ, మీరు ఆత్మహత్య చేసుకోకుండా మిమ్మల్ని వారించి మీకు మాటలలో సానుభూతి కొల్లలుగా కురిపించే మనుషులున్నారు. డబ్బుంటే చాలు అవన్నీ వస్తాయి. మీ పిల్లలకే మీ అవసరం. ఆప్యాయత, ఆప్టే లేదు వారికి వుగ్గుపాల వయసునుండీ మాలాటి దాసదాసీలున్నారు. మీ బిజినెస్ విషయాలు బోధపరిచే మేనేజర్లున్నారు. ఫామిలీ డాక్టర్లున్నారు. లాయర్లున్నారు. అంచేత మీరున్నా, లేకున్నా బాధలేదు వాళ్ళకి.

“మొన్న నేను గమనించాను. ‘నేను స్లీపింగ్ పిల్స్‌తో చనిపోతాను వురిపోసుకుంటాను. కరెంటు ముట్టుకుంటాను’ అంటూ మీరే మీ మరణపరికరాల్ని గురించి అందరికీ హెచ్చరించి, వాటిని దూరం చేయించారు మహా తెలివిగా. నిజానికి మీ తలగడా కిందవున్న స్లీపింగ్‌పిల్స్ మింగటానికి మీకు టైం దొరకలేదంటే నేను నమ్మను.

“ఆ ఉద్రేకం కాస్త తగ్గాక మీరే స్వయంగా నాతో ‘రంగనాయకీ! పిల్లలకింకా బిజినెస్ విషయాలు ఆస్తుల వివరాలు తెలియలేదు. పెళ్ళిళ్ళయి జీవితంలో స్థిరపడలేదు. నేనెలా చావను?’ అని అన్నారు గుర్తుందా? మరణంపట్ల భయం, జీవితంపట్ల తీపి, మిమ్మల్ని మళ్ళీ మళ్ళీ ఆలోచించేట్లు చేశాయి. అప్పుడు ‘పాతివ్రత్యం’ అన్నది కేవలం ఉద్రేకంగా మీకు తోచింది.

“పాతివ్రత్యం అన్నది కేవలం భర్త వెంట విమానాల్లో, విదేశాల్లో, విహారయాత్రల్లో అనుసరించటం ఒక్కటే అని నేననుకోవటం లేదండీ అమ్మగారూ! భర్తలో ఏ లోపాలున్నా సర్దుకుపోవటం, సమర్థించుకోవటంలో వుంది పాతివ్రత్యం. తన కుటుంబ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించుకోవటంలో వుంది పాతివ్రత్యం భార్యగా డ్యూటీలే కాదండీ, తల్లిగా బాధ్యతలున్న ఇల్లాలే పతివ్రత. ఆమె పునిస్త్రీ కానీండి విధవ కానీండి.

“నా ఈ మాటలు మీకు కోపం తెప్పిస్తాయని తెలుసు. మీరు నన్ను పనిలో నుంచి మాన్పిస్తారనీ తెలుసు. కానీ ప్రతి నిముషం నేను నా భర్తతోబాటు చనిపోలేదంటూ, నేను పతివ్రతను కాదంటూ మీరు చేసే వ్యాఖ్యలు నేను భరించలేను. శలవు!” అంది. అంటూనే రంగనాయకి వెళ్ళిపోయింది.

శారదతోబాటు నేను నిర్ఘాంత పోయాను.

“ఇప్పడీ డబ్బుకేమిటి తొందర లలితా?” అంది శారద, కాస్సేపటి తర్వాత, తనని తాను సంబాళించుకుంటూ, నాతో.

“నీకేం తొందరలేదని నాకు తెలుసు కానీ ఈ అప్పు తీరిపోనీ. మరోసారి ఇలాటి అప్పుతో అవసరం రాదు.” అన్నాను చిరునవ్వు నవ్వుతూ. బంగళాదాటి, రోడ్డుమీదకు వచ్చి, సిటీ బస్సెక్కాను. రంగనాయకి చెప్పినంత స్పష్టంగా, నేనైతే చెప్పలేకపోయేదాన్నేమో. రంగనాయకిని మనస్సు పదేపదే అభినందిస్తోంది. □